క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం

పట్నంబజారు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పాత గుంటూరు పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడికి చెందిన ఎం.జగన్ సుబ్బారావు గుంటూరు పరిసర ప్రాంతాల్లో ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సుద్దపల్లి డొంక ప్రాంతంలో దాడి చేసి ఆటోలో తరలిస్తున్న మూడు టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి మృతిపై కేసు నమోదు



పట్నంబజారు : లాడ్జిలో పనిచేస్తున్న వృద్ధుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట మంజు లాడ్జిలో కొన్ని సంవత్సరాలుగా జి.రామయ్య (60) పని చేస్తున్నాడు. అతడి వివరాలు ఎవరికీ తెలియదు. గత నెల 29న రాత్రి లాడ్జిలో పడుకున్న రామయ్య శుక్రవారం తెల్లవారుజామున ఎంతసేపటికీ లేవకపోవడంతో నిర్వాహకులు మృతి చెందినట్లు గుర్తించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవాగారంలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కొత్తపేట పీఎస్ ఎస్హెచ్ఓ అన్వర్ బాషా (8688831320), హెడ్ కానిస్టేబుల్ టి.వెంకటరాజు (8309229750) సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

గుంటూరు రూరల్: రెండు లారీలు ఢీకొన్న సంఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పేరేచర్ల క్రషర్లకు చెందిన లారీ లోడుతో వెళుతూ నల్లపాడు కాలువ వద్ద రోడ్డు పక్కన డ్రైవర్ నిలిపాడు. అదే సమయంలో పేరేచర్ల నుంచి లోడుతో వస్తున్న మరో లారీ దాన్ని వెనుకనుంచి ఢీకొంది. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. సంఘటనపై నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు అందలేదని తెలిసింది.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు

సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి స్వాగతం పలుకుతున్న నూరిఫాతిమా

పట్నంబజారు: టీడీపీపై నమ్మకం లేక వైఎస్సార్ సీపీలోకి భారీ వలసలు మొదలయ్యాయని పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా చెప్పారు. నియోజకవర్గంలోని రెండో డివిజన్ ఇజ్రాయిల్‌పేట చర్చి పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న టీడీపీ, జనసేన, బీజేపీ మద్దతుదారులు ఖాదర్, ఏసోబు, దాసు, మల్లయ్య, లాభన్, చక్రవర్తి, బెన్హర్, మరియదాసు, లూర్దర్, శివతోపాటు పలువురు శుక్రవారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం నేత సూరజ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి స్వాగతం పలికిన నూరిఫాతిమా మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీలోకి అనేక పార్టీల నుంచి వలసల పర్వం కొనసాగుతోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనా దక్షత తెలిసిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీలోకి వస్తున్నారని తెలిపారు. కుల, మత, ప్రాంత, పార్టీ, వర్గ భేదాలు లేకుండా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అమలవుతున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీకి అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మర్రి అంజలి, వైఎస్సార్ సీపీ నేత సత్యం, పలు కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

అక్రమ గ్యాస్ సిలెండర్ల గుట్టురట్టు



సిలెండర్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ సిబ్బంది

నగరంపాలెం: అక్రమ గ్యాస్ సిలెండర్లను విక్రయిస్తున్న ముగ్గురిపై విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేశారు. వారి నుంచి 56 సిలెండర్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు శుక్రవారం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కార్తికేయ హోటల్ వెనుక అక్రమంగా గ్యాస్ సిలెండర్లు నిల్వ చేసి, విక్రయిస్తున్నారనే సమాచారంతో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. నిందితుల్లో ఒకరు ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన పాదర్తి కుమార్‌రాజాగా గుర్తించారు. అతను సబ్సిడీ సిలెండర్లలోని గ్యాస్‌ను వ్యాపార అవసరాలకు వాడే సిలెండర్లల్లోకి ఎక్కించేవాడు. అనంతరం వాటిని పులుగు రామకృష్ణ సాయంతో గుంటూరు బస్టాండ్ వద్దకు తరలించేవాడు. సిలెండర్లను చిచ్చుల సుబ్బారావు (ఋషి వ్యాలీ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్) సహకారంతో అవసరమైన హోటల్స్ నిర్వాహకులకు రూ.1,600 నుంచి రూ.1,650కు విక్రయించి, సొమ్ము చేసుకునేవారు. నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం గ్యాస్‌తో ఉన్న 24 సిలెండర్లు, 32 ఖాళీ సిలెండర్లను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. కుమార్‌రాజాతోపాటు రామకృష్ణ, సుబ్బారావుపై 6ఏ కేసు నమోదు చేయాలని పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దార్‌ను విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ ఎస్.శ్రీనివాసులురెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి సీఎం పెద్దపీట



ఇళ్ల పట్టాలు పొందిన మహిళలతో కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ, నేతలు

లక్ష్మీపురం: రాష్ట్రంలో ప్రతి పేదవాడికీ సొంత స్థలంతో పాటు అందులో ఇల్లు ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) అన్నారు. ఆయన 31లక్షల మందికి నివేశన స్థలాలు మంజూరు చేయడంతోపాటు, ఇల్లు నిర్మించి ఇచ్చే గొప్ప కార్యక్రమం చేపట్టారని తెలిపారు. 32వ డివిజన్‌కు చెందిన 127, 128, 129, 130 సచివాలయాల పరిధిలోని 470 మందికి శుక్రవారం బ్రాడీపేటలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని రీతిలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుకు విప్లవాత్మకమైన సంస్కరణలు తెచ్చారని చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌కు మరో 30 సంవత్సరాలు ఈ రాష్ట్రాన్ని పాలించే విధంగా అందరూ తోడుగా నిలబడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, వలివేటి వెంకటరమణ, మాదాసు కిరణ్, భాగ్యారావు, సింగు నరసింహారావు, డేవిడ్, శ్యాం సుందర్, పండ్ల నారాయణ, గంగయ్య పాల్గొన్నారు.

మనసున్న మారాజు జగనన్న



మాట్లాడుతున్న కార్పొరేటర్ బూసి రాజలత

లక్ష్మీపురం: పేదల సొంతింటి కలను నిజం చేసిన మనసున్న మారాజు సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని 34వ వార్డు కార్పొరేటర్ బూసి రాజలత అన్నారు. గుంటూరులోని 121 సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గూడు లేని నిరుపేదలకు సీఎం జగనన్నతోడుగా నిలిచారని, ప్రతి మహిళకూ సొంత ఆస్తి కల్పించారని తెలిపారు. రూ.5 లక్షలకు పైగా విలువ చేసే భూమిని ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించారని, గతంలో ఏ ప్రభుత్వమైనా ఇంత గొప్ప పని చేసిందా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో అడ్మిన్ కె.సురేష్, వీఆర్వో బూసిరాజు శ్రీనివాసరావు, ఎడ్యుకేషన్ సెక్రటరీ నజీర్, వలంటీర్లు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర కీలకం

ఏఎన్‌యూ: దేశాభివృద్ధిలో స్వచ్ఛంద సేవా సంస్థల పాత్ర ఎంతో కీలకమని ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో 'నెట్‌వర్కింగ్ అండ్ ఇంటర్‌ఫేసింగ్ ఆఫ్ నాన్- గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ ఫర్ కన్వర్జెన్స్ ఇన్ సోషల్ ఏక్షన్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శనివారం యూనివర్సిటీలో ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ ప్రసంగిస్తూ సోషియాలజీ, సోషల్ వర్క్ విద్యార్థులు, పరిశోధకులు ప్రజలకు సేవ చేయడానికి స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి దానినే కెరీర్ గా ఎంచుకోవాలని సూచించారు.తమిళనాడు కోయంబత్తూర్ భారతీయార్ వర్సిటీకి చెందిన ఆచార్య సి. వెంకటాచలం కీలకోపన్యాసం చేస్తూ ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేసిన కోవిడ్ మహమ్మారిని తరిమికొట్టడంలో , వృద్ధులు, స్త్రీ శిశు సంక్షేమం, మహిళా సాధికారత, భద్రతలో ఎన్జీవోలు అందిస్తున్న కృషి ఘనమైనదని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్ అసిస్టెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఏ. కుమార రాజా, సదస్సు డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పట్నంబజారు: వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగడిగుంట కోటిరెడ్డివారివీధికి చెందిన శోభి స్నేహలత (25)కు 2022లో వసంతరాయపురానికి చెందిన లాజరస్‌తో వివాహమైంది. నాటి నుంచి లాజరస్, అతని కుటుంబ సభ్యులు స్నేహలతను నిత్యం వేధింపులకు గురిచేసేవారు. దీంతో సంగడిగుంట ప్రాంతానికి కాపురాన్ని మార్చారు. అయినప్పటికీ నిత్యం డబ్బుల కోసం వేధింపులకు గురి చేస్తుండేవాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో భర్త వేధింపులు భరించలేక శుక్రవారం మధ్యాహ్నం స్నేహలత ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి గూడవల్లి ఏసు మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల పాలిట కల్పవృక్షాలు - మన గుంటూరు కోల్డ్ స్టోరేజీలు

Advt Special Feature

రైతులకు ప్రయోజనకరంగా కోల్డ్ స్టోరేజీలు

- జిల్లా వ్యాప్తంగా 120కి పైగా రైతులకు సేవలు
- నెలల తరబడి తాజాగా పంటలు
- రైతులకు సహాయకారిగా యజమానులు
- తక్కువ ధరలకే నిల్వ అవకాశం

కొరిటిపాడు(గుంటూరు): గతంలో పంటల్ని నిల్వ చేసుకోవాలంటే రైతులు అనేక కష్టాలు పడేవారు. ఇళ్లు, పొలాల్లోనూ జాగ్రత్తగా భద్రపరచుకునేవారు. అయితే, కీటకాలు, మూషికాల బారినుంచి కాపాడుకునేందుకు అవస్థలు పడేవారు. కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుతో క్రమేణా రైతులు ఆ బాధలు నుంచి బయటపడ్డారు. పండించిన పంట తొలుత ఎలా ఉందో నెలలు గడిచిన, అమ్మే వరకు తాజాగా ఉంటుంది. రైతులకు ప్రయోజనకరంగా జిల్లావ్యాప్తంగా కోల్డ్ స్టోరేజీలు వందల్లో ఏర్పడ్డాయి.

నాణ్యమైన మౌలిక సౌకర్యాలు

గుంటూరు జిల్లాలో సుమారు 120కి పైగా శీతల గిడ్డంగులు ఉన్నాయి. గుంటూరు నగరానికి అనుసంధానంగా సుమారు 90పైగా అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో స్థానిక రైతులతో పాటు ఇతర జిల్లాల్లోని వారు సరుకు భద్రపరుచుకునేందుకు నిర్వాహకులు నాణ్యమైన మౌలిక సౌకర్యాలు కల్పించారు. విశాలమైన గదులు, లిఫ్ట్ సౌకర్యం, రైతులు బస చేసేందుకు వీలుగా విశ్రాంతి గదులు, తక్కువ ధరలకే బస్తాలను అద్దెకు భద్రపరుచుకునేలా ఏర్పాట్లు చేశారు. దీంతో గుంటూరు నగర శివారు ప్రాంతాలతో పాటు కర్నూలు, అనంతపురం , కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా, కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి నుంచి రైతులు మిర్చిని విక్రయించుకునేందుకు ఇక్కడ శీతల గిడ్డంగులను ఆశ్రయిస్తుంటారు. రైతుల రాకతో గిడ్డంగులు నిండు కుండలా మారుతున్నాయి.

రైతులకు సేవల్లో ముందంజ

గిడ్డంగుల యజమానులు రైతులకు మరిన్ని సౌకర్యాలను కల్పించడంలో ముందంజలో ఉంటున్నారు. కొందరైతే ఏకంగా రుణాలు సైతం ఇప్పిస్తున్నారు. దీని ద్వారా రైతులకు లాభదాయకంగా మారింది. వ్యవసాయ మార్కెట్ యార్డుకి తీసుకొచ్చిన సరుకు ఏదైనా అమ్మకం జరగకపోయినా వెంటనే గిడ్డంగుల్లో అరబెట్టేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. దీనికితోడు శీతలీకరణ (ఏసీ) నిర్వహణ బేషుగ్గా నిర్వహిస్తున్నారు. 6 నుంచి 8 డిగ్రీల వరకు నిర్వహణ చేస్తున్నారు. కోల్డ్‌స్టోరేజీల నిర్వాహకులు సైతం తక్కువ ధరలకే పంటలను నిల్వ చేసుకుంటున్నారు. రైతులు నిల్వ ఉంచిన సరుకును ఎంచక్కా అధిక ధరలకు విక్రయించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సరుకు నిల్వపై పురుగు మందుల వాడకం

పురుగు మందుల వాడకం కూడా సరుకు నిల్వపై ప్రభావం చూపుతుందని గిడ్డంగుల యజమానులు అంటున్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు మంచి విత్తనాలు తీసుకుని, వారి ఆచరణకు అనుగుణంగా మందుల వాడకం వల్ల అధిక దిగుబడికి అవకాశం ఉంది. దానికితోడు సరుకులో నాణ్యత పెరుగుతుంది. దీనివల్ల రైతులు అందరూ లాభదాయంగా ఉంటారని కోల్డ్ స్టోరేజ్ యజమానులు సూచిస్తున్నారు.

పంట నాణ్యతకు పెద్దపీట

రైతుల శ్రమను దృష్టిలో ఉంచుకుని అతి తక్కువ ధరలకే పంటను గిడ్డంగుల్లో నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. దీనికితోడు సరుకు పాడవకుండా నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నాం. రైతులు పండించిన పంటను సకాలంలో అమ్ముకోవాలంటే ఒక్కోసారి కుదరదు. ఎందుకంటే కాస్తంత ధర పలికితే విక్రయించాలని చూస్తుంటారు. ఒక్కొక్కసారి గిట్టుబాటు ధర లభించకపోవచ్చు. ఈ సమయంలో సరుకును గిడ్డంగుల్లో నిల్వ చేసుకుని ఆశించిన ధర వచ్చినప్పుడు విక్రయించుకోవచ్చు. కొన్ని కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాలు రైతులకు బ్యాంకు రుణాలు సైతం అందిస్తున్నాయి. ప్రభుత్వం కూడా విద్యుత్తు సబ్సిడీ కల్పిస్తే తక్కువ ధరకే సరుకును భద్రపరుచుకునేందుకు అవకాశం ఉంటుంది.

–తడకమళ్ల సూర్యప్రకాశరావు, ది కోల్డ్ స్టోరేజీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

గిడ్డంగుల్లో 45 లక్షల మిర్చి బస్తాలు నిల్వ

కోల్డ్‌స్టోరేజ్‌లకు ఇప్పుడిప్పుడే మిర్చి బస్తాలు వస్తున్నాయి. ఇప్పటి వరకు 16 లక్షల టిక్కీలు పాతవి, మరో 29 లక్షల టిక్కీల కొత్త సరుకు చేరుకుంది. రైతులకు మంచి సర్వీసు అందిస్తున్నాం. మొత్తంగా 45 లక్షల బస్తాలను రైతులు నిల్వ చేసుకున్నారు. బస్తా ఒక్కింటికి రూ.210 మాత్రమే వసూలు చేస్తున్నాం. కోవిడ్ కాలంలో కూడా గిడ్డంగులు రైతులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. సరుకు నాణ్యతలో గిడ్డంగుల యజమానులు రాజీపడటంలేదు. అందులో శీతలీకరణలో మరింత నాణ్యత ప్రమాణాలను పాటిస్తున్నాం. రైతులకు మంచి సర్వీసు ఇవ్వాలన్నది ప్రతి ఒక్కరిలో ఉంది.

–పి.సురేంద్రబాబు, ది కోల్డ్ స్టోరేజీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి